సాక్షి ప్రకాశం
శుక్రవారం, 29, డిసెంబర్, 2023



వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలు

వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులకు జనవరి ఒకటో తేదీ నుంచి రూ.3 వేలు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు.

- 8లో..



నల్లమలలో ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం

నల్లమల అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ ఉత్పత్తులపై నిషేధం అమలు చేస్తున్నట్లు టైగర్ ప్రాజెక్టు అటవీ శాఖ డీడీ విఘ్నేష్ అప్పావ్ తెలిపారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30/21

వాతావరణం

ఉదయం పొగ మంచు ఎక్కువగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు పెద్దారవీడు స్పందన రద్దు

ఒంగోలు అర్బన్: పెద్దారవీడులో శుక్రవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం అనివార్య కారణాలతో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియచేస్తామని పేర్కొన్నారు.

ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: త్రైమాసిక తనిఖీల్లో భాగంగా స్థానిక మామిడిపాలెం రెండో ఈవీఎం గోదామును కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ గురువారం పరిశీలించారు. గోదాములో భద్రపరిచిన ఈవీఎంలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. అక్టోబర్‌లో ఫస్ట్ లెవల్ చెకింగ్ నిర్వహించి భద్రపరిచిన తీరును పరిశీలించారు. త్వరలో ఈవీఎంలకు ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, కాలేషా తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు

ఒంగోలు: జాతీయస్థాయి ఫెన్సింగ్ జూనియర్ పోటీలకు (అండర్ 20) జిల్లా క్రీడాకారులు ముగ్గురు ఎంపికయ్యారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ ఫెన్సింగ్ పోటీల్లో వ్యక్తిగత విభాగాల్లో పతకాలు సాధించి చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్ పట్టణంలోని అగ్రసేన్‌ధామ్‌లో జాతీయ స్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారు. ఈపీ విభాగంలో ఒంగోలుకు చెందిన బెజవాడ సమత్ర, ఫాయిల్ విభాగంలో లింగంగుంటకు చెందిన కోడెల తనూజ, పర్చూరుకు చెందిన క్రిష్టంశెట్టి ప్రణీత్ ఎంపికయ్యారని ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన ముగ్గురు క్రీడాకారులను ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు వి.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనపై సర్వే చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: గిరిజనులు నివసించే ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు జనవరి 10వ తేదీ లోపు సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రకాశంభవనంలో గురువారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులకు మూడేళ్లలో రూ.24వేల కోట్లతో ఇళ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నందున, జిల్లాలో గిరిజనులకు ప్రయోజనం కలిగేలా ముఖ్యంగా చెంచులకు ప్రయోజనం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఆ దిశగా ఇళ్లు పొందేందుకు 2515 చెంచు కుటుంబాలను అర్హత కలిగినట్లు గుర్తించామని ఐటీడీఏ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. అయితే హౌసింగ్‌పై సర్వే చేయాలని గృహనిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గిరిజన నివాస ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వంటి సదుపాయాలు కల్పించేందుకు, టెలికాం సేవలు అందించేందుకు అవసరమైన సర్వే నిర్వహించాలన్నారు. స్థానిక అవసరాలను బట్టి కేంద్ర ప్రభుత్వం జనవరి 25వ తేదీ నాటికి వాటిని మంజూరు చేస్తుందన్నారు. జనవరి 15వ తేదీ నాటికి జిల్లాలో పరిస్థితితులపై నివేదికను కేంద్రానికి పంపాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నిర్దిష్ట గడువు లోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పేరయ్య, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, ఆర్ డబ్ల్యూస్ ఎస్ఈ మర్దన్ అలీ, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, ఐటీడీ పబ్లిక్ హెల్త్ అధికారులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ చుట్టూ..

దామచర్ల రాజకీయ కంపు

దశాబ్దకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఒంగోలు నగరవాసులతో పాటు కొప్పోలు, కొత్తపట్నం వాసులకు మేలు జరిగే పని ఇది. శాశ్వతంగా ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ముందుకు వచ్చారు. రూ.కోటితో డ్రైనేజీ పనులు ప్రారంభించారు. దీనికి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనర్దాన్ సైంధవుడిలా అడ్డుపడుతున్నారు. ప్రజలు పడుతున్న అవస్థ కంటే ఆయనకు పార్టీ కార్యాలయం ఎక్కువైపోయింది. నియోజకవర్గంలో ప్రజోపయోగ పనులకు అడ్డుపడుతూ వస్తున్న దామచర్ల డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను ఆపేయాలంటూ ఆందోళనకు దిగారు.





నవంబర్ 30న డ్రైనేజీ పనులకు భూమిపూజ చేసి బాలినేని ఆవిష్కరించిన శిలాఫలకం

- కొప్పోలులో డ్రైనేజీ నిర్మించాలని బాలినేనిని కోరిన స్థానికులు
- డ్రైనేజీ నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయించి పనులు ప్రారంభించిన బాలినేని శ్రీనివాసరెడ్డి
- నాడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా టీడీపీ కార్యాలయ నిర్మాణం
- డ్రైనేజీ పనులకు టీడీపీ కార్యాలయం అడ్డంకి
- పనులు ఆపాలంటూ దామచర్ల హెచ్చరికలు
- దామచర్ల తీరుపై స్థానికుల ఆగ్రహం
- ఇదేమి పని జనార్దనా అంటూ నిలదీత

సాక్షిప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు నియోజకవర్గంలో అభివృద్ధిని అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారు టీడీపీ నాయకులు. పేదల ఇళ్ల పట్టాల పంపిణీ నుంచి కొప్పోలులో నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ నిర్మాణం వరకూ అడ్డుతగులుతూనే ఉన్నారు. ఒక వైపు అభివృద్ధి జరగడం లేదంటూనే మరో వైపు వాటికి అడ్డుతగులుతూనే అభివృద్ధి కంటకులుగా మారిపోయారు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు దామచర్ల జనార్దన్. ప్రజా సమస్యలు బాలినేని పరిష్కారం చేస్తే తన మనుగడకు ఎక్కడ భంగం కలుగుతుందోనని భావించిన ఆయన కుయుక్తులు పన్నుతూనే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని విప్లవాత్మకంగా ప్రారంభించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నగరంలో తిరుగుతూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూనే ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారు. 9వ డివిజన్ పరిధి ఇందిరమ్మ కాలనీ, కొప్పోలు ప్రాంతాల్లో తిరుగుతున్నప్పుడు స్థానికులు డ్రైనేజీ సమస్యను బాలినేని దృష్టికి తీసుకువచ్చారు.

దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని కొత్తపట్నంలో రోడ్డు కొప్పోలులో ప్రధాన డ్రైనేజీ కాలువ నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. దీంతో సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన డ్రైనేజీ కాలువ నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేయించారు. 9వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీ 1వ లైను ప్లాట్ నెం–53(విజయ్ మోహన్ ఇంటి)నుంచి గుత్తిగొండవారిపాలెం రోడ్‌లో ఉన్న కల్వర్టు వరకు సీసీ కాలువ నిర్మాణం కోసం 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయించారు. అందుకోసం టెండర్ల ప్రక్రియ పూర్తయిన తరవాత ఈ ఏడాది నవంబర్ 3వ తేదీన బాలినేని ప్రధాన డ్రైనేజీ కాలువ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో కొప్పోలు ప్రజలు దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించిందని భావించి ప్రజలు ఆనందంతో ఉన్నారు. ఈ పని పూర్తయితే బాలినేని ఎక్కడ మంచి పేరువస్తుందోనని భావించి దామచర్ల కుట్రకు తెరతీశారు.

టీడీపీ కార్యాలయం పేరుతో కుట్ర

దీర్ఘకాలంగా తాము పడుతున్న అవస్థలకు పరిష్కార లభిస్తుందన్న సంతోషంలో స్థానికులు డ్రైనేజీ నిర్మాణానికి అడ్డుగా ఉన్న తమ స్థలాలను వదులుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. అయితే ప్రజల అవస్థలు కన్నా దామచర్లకు తన పార్టీ కార్యాలయం ఎక్కువైపోయింది. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వ స్థలంలో అడ్డగోలుగా పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. డ్రైనేజీ కాలువ నిర్మాణం కోసం ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు మార్కింగ్ వేశారు. అక్రమంగా నిర్మించిన టీడీపీ పార్టీ కార్యాలయం ముందు ఒక అడుగుమేరకు తొలగించాల్సి ఉంటుంది. దీనిపై దామచర్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణాలైనా అర్పిస్తాం కానీ టీడీపీ కార్యాలయాన్ని పగులగొట్టేందుకు అంగీకరించేది లేదంటూ నిర్మాణ పనులు జరుగుతున్న కాలువవద్దకు వెళ్లి మరీ హెచ్చరించారు దామచర్ల.

కొప్పోలులో మూడు దశాబ్దాల క్రితం వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని నిర్మించారు. ఆ భవనాన్ని అధికారులు కొత్తపట్నం రోడ్డు మార్జిన్‌ను వదిలిపెట్టి ప్రభుత్వ స్థలం కట్టారు. ఆ భవనాన్ని హద్దుగా పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకుని ఉంటే ఇప్పుడు ఈ సమస్య వచ్చేది కాదు. డ్రైనేజీ నిర్మాణం కోసం ఒక వైపు కొప్పోలు నివాసస్తులు ఇంటి మెట్లు కూడా తొలగించుకొని సహకరిస్తుంటే పార్టీ కార్యాలయం కోసం ఇలా చేయడం దామచర్లకు తగదని స్థానికులే ఛీత్కస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘించి ఇప్పుడు అభివృద్ధిని అడ్డుకోవడం ఏంటని ప్రజలు తూర్పార పడుతున్నారు.



డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా రోడ్డు మార్జిన్‌లో ఉన్న టీడీపీ కార్యాలయానికి మార్కింగ్



డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న దామచర్ల జనార్దన్

పేదల ఇళ్లపట్టాల విషయంలోనూ...

ఒంగోలు నగరంలోని సొంత ఇళ్లు లేని నిరుపేదల ఇళ్ల పట్టాల విషయంలోనూ దామచర్ల జనార్దన్ విషం చిమ్మారు. నిలువ నీడలేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి సొంత ఇళ్లు నిర్మించాలని బాలినేని శ్రీనివాసరెడ్డి భావించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 25 వేల మందికి ఒకేచోట పట్టాలు ఇచ్చి శాటిలైట్ టౌన్‌షిప్‌ను నిర్మించాలనుకున్నారు. అందుకోసం యరజర్ల వద్ద స్థలాన్ని చదును చేసి ప్లాట్లుకూడా ఏర్పాటు చేశారు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయాల్సి ఉంది. ఇక్కడే దామచర్ల జనార్దన్ కడుపు భగ్గుమంది. ఇంకేముంది ఇంతమందికి ఒకేచోట ఇళ్లు కట్టిస్తే ఇక తన రాజకీయ జీవితమే కనుమరుగు అవుతుందని భావించి తన అనుచరుల చేత హైకోర్టులో కేసు వేయించారు. దాంతో ఇళ్ల పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు. అదే జనార్దన్ అడ్డుకోకుండా ఉండి ఉంటే ఇప్పటికే నిళ్ల నిర్మాణాలు పూర్తయి గృహ ప్రవేశాలు కూడా పూర్తయ్యేవి. నగర పరిసరాల్లో నూతన పట్టణం ఏర్పడేది. దామచర్లా నీకు ఇది తగునా అంటూ సొంతిళ్లు లేని నిరుపేదలు దుమ్మెత్తిపోస్తూ శాపనార్థాలు పెడుతున్నారు.



కాలువ పనులు ఆపమనడం మంచి పద్ధతి కాదు

డ్రైనేజీ నిర్మించి ప్రజలు అవస్థలు తీరుతాయనుకుంటే కాలువ పనులకు దామచర్ల జనార్దన్ అడ్డుకోవడం మంచి పద్ధతి కాదు. టీడీపీ కార్యాలయం వెనక్కి జరుపుకొని కట్టుకోవచ్చు. కానీ కాలువను రోడ్డులోకి వస్తే ప్రజలు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడతారు. ఈ కాలువ నిర్మాణంతో మురుగు, వర్షం నీరు సక్రమంగా పోతురాజు కాలువకు చేరుతాయి. ప్రజాపయోగమైన పనులను దామచర్ల అడ్డుకోవడం సరైన పద్ధతి కాదు.

– జమ్ము రత్తయ్య, స్థానిక నేత



60 ఏళ్ల కల నెరవేరుతుంది

ఒంగోలు నగర ప్రజల, కొప్పోలు ప్రజల 60 ఏళ్ల కల నెరవేరుతోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వాసన్నకు స్థానికులు డ్రైనేజీ సమస్యను విన్నవించారు. దీంతో వాసన్న రూ.కోటి నిధులు మంజూరు చేయించారు. సమస్య పరిష్కారం అవుతుందనుకుంటున్న సమయంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పనులకు అడ్డుకోవడం సరికాదు. టీడీపీ వాళ్లకు పార్టీ కార్యాలయం ముఖ్యమా లేక అభివృద్ధి పనులు ముఖ్యమా తెలుసుకోవాలి.

– వెన్నపూస శోభారాణి వెంకటరెడ్డి, 9వ డివిజన్ కార్పొరేటర్



స్థానికులు సహకరిస్తున్నారు

కొప్పోలులో డ్రైనేజీ పనులకు స్థానికులు బాగా సహకరిస్తున్నారు. రోడ్డు పక్కన ఇళ్లు ఉన్న వాళ్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇంటి మెట్లు తొలగించి కాలువ పనులకు సహకరిస్తున్నారు. దశాబ్దాల డ్రైనేజీ సమస్యకు పరిష్కారం దొరికిందని సంతోషిస్తుంటే టీడీపీ నేతలు సైంధవుల్లా అడ్డుపడుతున్నారు. దామచర్లకు అభివృద్ధి అంటే అసలు నచ్చదు.

– భవనం వేణుగోపాల్ రెడ్డి, స్థానికుడు

నేడు జగనన్న విద్యా దీవెన

- నాల్గవ విడుత నిధులు విడుదల
- జిల్లాలో 38,280 మంది విద్యార్థుల తల్లులకు రూ.30.92 కోట్లు విడుదల

ఒంగోలు సెంట్రల్: జగనన్న విద్యా దీవెన నాల్గవ విడత నిధులు శుక్రవారం విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ కానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నిధులు విడుదల చేయనున్నారు. అదే సమయంలో ప్రకాశం భవన్‌లోని స్పందన కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే మెగా చెక్కు పంపిణీ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కానున్నారు. జిల్లాలో మొత్తం రూ. 30.92 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుంది.



పంపిణీకి సిద్ధంగా ఉన్న చెక్కు

ఏర్పాట్లను జిల్లా సాంఘిక సంక్షేమాధికారి ఎస్ లక్ష్మనాయక్ పర్యవేక్షిస్తున్నారు.

38,280 మంది తల్లుల ఖాతాల్లో నిధుల జమ

డిగ్రీ, పీజీతో పాటు ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఈ నిధులు విడుదల కానున్నాయి.

జిల్లాలో 41,868 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా అర్హులు 38,280 మంది ఉన్నారు. అందుకు సంబంధించిన

నియోజక వర్గాల వారీగా నిధులు ఇలా...

నియోజకవర్గం	విద్యార్థుల సంఖ్య	విద్యార్థుల తల్లుల సంఖ్య	విడుదల అవుతున్న మొత్తం (రూ.)
దర్శి	5413	4991	4,03,01,607
గిద్దలూరు	5575	5131	3,51,06,847
కనిగిరి	5283	4836	3,86,93,563
కొండపి	5982	5431	4,69,58,747
మార్కాపురం	4479	4102	3,24,85,681
ఒంగోలు	5631	5095	4,33,65,564
ఎస్.ఎన్.పాడు	4914	4431	3,9247,645,
వైపాలెం	4591	4263	3,31,13,120
మొత్తం	41868	38280	309272774

సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు చర్యలు

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం అవసరమైన మౌలిక వసతులు, మానవ వనరుల నిర్వహణపై ఇప్పటి నుంచి ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కోర్ టీమ్ సభ్యులతో గురువారం ప్రకాశంభవనంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల అబ్జర్వర్స్ కోసం జిల్లాలోని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లకు అవసరమైన మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలు ఒంగోలుకు చేర్చేందుకు ముందుగానే మొత్తం సమీకరించుకునేలా రెండు మూడు నియోజవర్గాలకు ఒకటి చొప్పున మధ్యంతర స్ట్రాంగ్ రూంలను గుర్తించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన విధులపై ప్రతి వారం అవగాహన నిర్వహించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈఆర్ఓ స్థాయిలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. 80 ఏళ్లు పైబడిన దివ్యాంగులు తమ ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు ఎన్నికల సంఘం కల్పించిందని తెలిపారు. లాజిస్టిక్స్, శాంతి భద్రతలు, సాయుధ బలగాల వినియోగం, ఓటర్లు ఉంటున్న స్థలం, రూట్ మ్యాప్ తదితర అంశాలపై అవగాహన కోసం వారితో ఓటు వేయించడంపై మాక్‌డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్ఓ శ్రీలత, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు విశ్వేశ్వరరావు, జాన్ ఇర్విన్, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానందం, డీపీఆర్ఓ గ్రేస్ లినోర, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఓటరు జాబితా జనవరి 22కి వాయిదా

జనవరి 5వ తేది ప్రచురించాల్సిన ఓటరు జాబితా జనవరి 22వ తేది నాటికి ఎన్నికల సంఘం మార్చిందని కలెక్టర్ తెలిపారు. ప్రకాశంభవనంలో వీక్లీ రివిజన్‌లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. దరఖాస్తుల పరిశీలనకు జనవరి 12వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, సత్యం, సరూల్, రాజశేఖర్, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

4975.9 ఎకరాల్లో పంట నష్టం

- మిచాంగ్ తుఫాన్ పంట నష్టం అంచనా రెడీ
- 8 నియోజకవర్గాల్లో 3775 మంది రైతులకు నష్టం
- ఇన్‌పుట్‌సబ్సిడీ జాబితా సిద్ధం



ఒంగోలు సెంట్రల్: జిల్లాలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంట నష్టం వివరాల జాబితా సిద్ధమైనట్లు వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు కురిసిన వర్షాలకు 8 నియోజకవర్గాల పరిధిలో 3775 మంది రైతులకు చెందిన 4,975.9 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. వ్యవసాయాధికారులు, గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయకులు రైతులకు చేసిన పలు సూచనల, సలహాలతో పంట నష్టం తగ్గినట్లు వివరించారు.

పంట నష్టం వివరాలు ...

పంట	రైతులు సంఖ్య	విస్తీర్ణం ఎకరాలు	ఇనుపుట్ సబ్సిడీ(రూ.)
వరి	2584	2799.2	1,90,34,560
మొక్కజొన్న	394	518.525	25,92,625
కంది	1	4.15	16,600
అలసంద	3	12.5	50,000
మినుము	492	817.37	32,69,500
పొగాకు	266	749.4	29,97,600
వేరుశనగ	1	5	34,000
నువ్వులు	34	69.75	2,37,150
మొత్తం	3775	4975.9	2,82,32,035

కోవిడ్ కలకలం

- ప్రైవేటు వైద్యశాలలో ర్యాపిడ్ పరీక్షల్లో పాజిటివ్
- ఒంగోలు జీజీహెచ్‌లో ఆర్టీపీసీఆర్ టెస్ట్‌లో నెగటివ్ రావడంతో ఊపిరి పీల్చుకున్న వైద్యులు
- రిమ్స్‌లో అన్ని ఏర్పాట్లు చేశాం: ఆర్ఎంఓ

ఒంగోలు టౌన్: ఒంగోలు జీజీహెచ్ ఆసుపత్రికి కోవిడ్ లక్షణాలతో బాధపడుతున్న గర్భిణి రావడంతో కలకలం రేగింది. బాపట్ల జిల్లా చినగంజాం మండలంలోని గొలసపూడి గ్రామానికి చెందిన మహిళ హైదరాబాద్‌లో నివాసముంటారు. ప్రస్తుతం ఆమె గర్భిణి. కొద్ది రోజులుగా జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులతో బాధ పడుతున్నారు. ఇటీవలే సొంతూరు గొలసపూడికి రాగా కుటుంబసభ్యులు ఇంకొల్లులోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడ కోవిడ్ లక్షణాలుగా అనుమానించిన వైద్యులు ప్రైవేట్ లేబొరేటరీలో ర్యాపిడ్ టెస్టు చేయించగా పాజిటివ్ వచ్చింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే ఒంగోలు జీజీహెచ్ వైద్యశాలకు తరలించారు. జీజీహెచ్ వైద్యులు ఆమెను ఆస్పత్రిలో ఇండో అమెరికన్ సంస్థ సహకారంతో నిర్మించిన కోవిడ్ ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స ప్రారంభించారు. ఆమెతో పాటుగా కుటుంబ సభ్యులకు కూడా గురువారం ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగిటివ్ వచ్చినట్లు ఆర్ఎంఓ డాక్టర్ బి.తిరుమలరావు తెలిపారు. వైద్య సిబ్బందిని ఇప్పటికే అప్రమత్తం చేశామని, సర్వజన ఆసుపత్రిలో సుమారు 200 పడకలను సిద్ధం చేశామని తెలిపారు. ఆక్సిజన్ ప్లాంట్‌లు కూడా సిద్ధంగా ఉంచామని, ఆర్టీపీసీఆర్ టెస్టుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. రోజుకు 300 వరకు ఆర్టీపీసీఆర్ టెస్టులు చేసేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దేశ వ్యాప్తంగా కోవిడ్ పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎంఓ డాక్టర్ తిరుమలరావు సూచించారు. గతంలో కోవిడ్ సమయంలో పాటించినట్లు ముందస్తు జాగ్రతలు పాటించాలన్నారు. జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్ల వద్దని, భౌతిక దూరం పాటించాలని, తప్పనిసరిగా మాస్క్ ధరించాలని, తరుచూ చేతులు శుభ్రం చేసుకోవాలని చెప్పారు.

అవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకుండా ఉండడం మేలన్నారు. జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, గొంతు నొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు: ఏపీ ఓపెన్ స్కూల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ అభ్యసిస్తున్న విద్యార్థులు పరీక్ష ఫీజును 2024 జనవరి 19వ తేదీలోగా చెల్లించాలని ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ బిజ్జం శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతికి ఒక సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియెట్ థియరీ ఒక సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ సబ్జెక్టు ఒకటికి రూ.100 చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇంటర్‌లో గతంలో కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిలై, పాసైన సబ్జెక్టులో ఇంప్రూవ్‌మెంట్ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.250, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇంటర్‌లో అన్ని సబ్జెక్టులు ఉత్తీర్ణులై ఇంప్రూవ్‌మెంట్ కోరేవారు థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.300, ప్రాక్టికల్ పరీక్ష ఒక్కోదానికి రూ.100 చొప్పున చెల్లించాలని తెలిపారు. గతంలోనే అన్ని సబ్జెక్టులు ఉత్తీర్ణులైన పదో తరగతి విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.200 చొప్పున ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరుకావచ్చన్నారు. 2024 జనవరి 5వ తేదీ నుంచి 19వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని, రూ.25 అపరాధ రుసుంతో జనవరి 20 నుంచి 27వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుంతో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు, ఆ తరువాత తత్కాల్ విధానంలో ఫిబ్రవరి 4 నుంచి 9వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు వివరించారు.



బేస్తవారిపేటలో వాలీబాల్ ఆడుతున్న యువతులు



మద్దిపాడు కడియాల యానాదయ్య హైస్కూల్లో కబడ్డీ ఆడుతున్న యువకులు



కొత్తపట్నం మోటుమాలలో వాలీబాల్..

ఆద్యంతం.. ఉత్సాహభరితం

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మూడో రోజు గురువారం ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగాయి. పోటీల్లో సత్తా చాటేందుకు విద్యార్థులు, యువతీయువకులు హోరాహోరీగా తలపడ్డారు. మ్యాచ్‌లను తిలకించేందుకు ప్రజలు అమితాసక్తి కనబరిచారు.

- సాక్షి నెట్‌వర్క్



ఒంగోలు పీవీఆర్ గ్రౌండ్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు



కనిగిరిలో హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



ఒంగోలు పీవీఆర్ గ్రౌండ్‌లో క్రికెట్ మ్యాచ్‌లో తలపడుతున్న 25 డివిజన్ జట్లు



సింగరాయకొండ : మూలగుంటపాడులో పోటీపోటీగా వాలీబాల్ ఆడుతున్న యువత



మార్కాపురంలో క్రికెట్ ఆడుతున్న యువకులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్టీఓ అమర్‌నాయక్

మార్కాపురం:ప్రజలు,వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని మార్కాపురం ప్రాంతీయ రవాణా అధికారి అమర్‌నాయక్ సూచించారు. గురువారం మహిళా పోలీసులకు పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో ఎంవీఐ మాధవరావు అధ్యక్షతన రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చూడాలన్నారు. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలు

- జనవరి ఒకటో తేదీ నుంచి అమలు
- డ్వాక్రా మహిళలకు ఆసరా నాలుగో విడత ఆర్థిక సహాయం
- సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్, మేయర్ గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు అర్బన్: వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులకు జనవరి ఒకటో తేదీ నుంచి రూ.3 వేలు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలను పండుగ వాతావరణంలో లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో జనవరి, ఫిబ్రవరిల్లో ప్రజలకు అందించే పలు సంక్షేమ కార్యక్రమాల అమలుపై వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నాలుగు అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత ఆర్థిక సహాయాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. చేయూత పథకానికి అర్హులైన లబ్ధిదారులకు కూడా ప్రయోజనం అందజేయనున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో మండల స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా విజయవాడలో రూ.404 కోట్ల వ్యయంతో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సామాజిక సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలపై గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట రవిబాబు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి

ఒంగోలు: జిల్లాలో 6 నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు తమ పేర్లను పరీక్షా పే చర్చ కాంటెస్టులో నమోదు చేసుకోవాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైజీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో ముందుగా తమ పేరు నమోదు చేసుకుని మొబైల్ లేదా ఈ మెయిల్ ఓటీపీ ద్వారా లాగిన్ కావాలన్నారు. నేరుగా లేదా ఉపాధ్యాయుని లాగిన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. పరీక్ష సమయంలో ఒత్తిడిని ఎలా అధిగమించాలనే అంశంపై 500 పదాలకు మించకుండా వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కాంటెస్ట్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ఈ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో జారీ చేస్తామన్నారు. ఉత్తమమైన ప్రశ్నకు నేరుగా ప్రధానమంత్రితో పరీక్షా పే చర్చలో పాల్గొనే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జనవరి 4 లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఏపీఎన్‌జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఏపీఎన్‌జీఓ సంఘ జిల్లా అధ్యక్షుడు శరత్ బాబు, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. హెల్త్ సెక్రటరీలకు డేట్ ఆఫ్ జాయినింగ్ 40 రోజులు ఆలస్యం కావడంతో వారికి అన్యాయం జరుగుతోందని, మిగిలిన సెక్రటరీల మాదిరిగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. సస్పెన్షన్‌లో ఉన్న సచివాలయ సెక్రటరీని తిరిగి విధుల్లోకి తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎం.వెంకటేశ్వర్లు, శివకుమార్, ఏడుకొండలు, శ్రీను, చిరంజీవి, ప్రసన్న, కిషోర్, మొమిన్, మాధవి, మంజేష్,షరీఫ్,నారాయణమ్మ,హరిబాబుతదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించేందుకే ఉచిత శిక్షణ

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్
- బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్–2 ఉచిత శిక్షణ ప్రారంభం



కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సెంట్రల్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏపీపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షల ఉచిత శిక్షణను ఉపయోగించుకుని బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు తమ లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆకాంక్షించారు. గురువారం స్థానిక ప్రభుత్వ భవనాల సముదాయంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఏపీపీఎస్సీ గ్రూప్–2 ప్రిలిమినరీ పరీక్షల ఉచిత శిక్షణను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులు ప్రతి అంశాన్ని విశ్లేషణాత్మకంగా చదువుతూ స్వయంగా నోట్స్ సిద్ధం చేసుకుని పరీక్షకు సన్నద్ధం కావాలని సూచించారు. కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాల్సిన ఆవశ్యకతను వివరించారు. డీఈఓ వీఎస్ సుబ్బారావు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, బీసీ వెల్ఫేర్ అధికారి ఎం.అంజల తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ మిషన్ జేఏసీ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు టౌన్: నూతన సంవత్సరంలోనూ వైద్యారోగ్య సిబ్బంది సహకారం కొనసాగించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి కోరారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల ప్రకాశం జిల్లా జేఏసీ ముద్రించిన నూతన క్యాలెండర్, డైరీని గురువారం డీఎంహెచ్‌ఓ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. త్వరలోనే కాంట్రాక్ట్ ఉద్యోగులు కూడా రెగ్యులర్ కావాలని ఆకాంక్షించారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు చల్లా ప్రభాకర్ రెడ్డి, జేఏసీ ప్రధాన కార్యదర్శి సైకాలజిస్ట్ ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆడిట్ అభ్యంతరాలు నివృత్తి చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీఎంఏ శ్రీనివాసరావు, పక్కన ఒంగోలు కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మున్సిపల్ కార్యాలయాలకు సంబంధించి ఆడిట్ అభ్యంతరాలను నివృత్తి చేసుకోవాలని గుంటూరు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్లో కమిషనర్ వెంకటేశ్వరరావుతో కలిసి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల కమిషనర్లతో ఆర్డీ సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలోని రెవెన్యూ, పారిశుధ్యం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఇతర విభాగాల్లోని ఆడిట్ అభ్యంతరాలకు నిర్దేశించిన సమయంలోగా సమాధానం ఇచ్చి సందేహాలు నివృత్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. సకాలంలో స్పందించని మున్సిపల్ కమిషనర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చీరాల, కందుకూరు మున్సిపాలిటీలకు సంబంధించి ఆడిట్ అభ్యంతరాలు ఎక్కువగా ఉన్నాయని రీజినల్ డైరెక్టర్ చెప్పారు.

స్నేహితుడి వివాహానికి వచ్చి.. కానరాని లోకాలకు..

- కారు ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

కృష్ణలంక(విజయవాడ తూర్పు): కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన పిట్టం రవికుమార్(30) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతని స్నేహితుడైన సునీల్ వివాహానికి బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి నగరానికి వచ్చి బందరురోడ్డులోని ఒక హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకున్నాడు. రాత్రి భోజనం చేసే క్రమంలో అతని మరో స్నేహితుడు కానూరుకు చెందిన కాశీవిశ్వనాథ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బందరురోడ్డులోని ఫుడ్‌కోర్టుకు వెళ్లారు. అక్కడ పార్శిల్ తీసుకుని హోటల్ రూమ్‌కు బయలుదేరారు. కాశీ విశ్వనాథ్ వాహనం నడుపుతుండగా రవికుమార్ వెనుక కూర్చున్నాడు. ఈ క్రమంలో మరో స్నేహితుడు ఫోన్ చేసి తనకు భోజనం తీసుకురమ్మని చెప్పాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 1.30 గంటల సమయంలో తిరిగి ఫుడ్‌కోర్టుకు వెళ్తున్నారు. ఈ సమయంలో గేట్‌వే హోటల్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా బెంజిసర్కిల్ వైపు నుంచి పశువుల హాస్పిటల్ వైపు వేగంగా వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో వాహనంపై వెళ్తున్న ఇద్దరు కిందపడిపోయారు. రవికుమార్ రోడ్డుకు గుద్దుకుని బలమైన గాయాలతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. కాశీవిశ్వనాథ్ స్వల్ప గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

నల్లమలలో ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం



- అటవీ శాఖ డీడీ వెల్లడి

మార్కాపురం: నల్లమల అటవీ ప్రాంతంలో జనవరి ఒకటో తేదీ నుంచి ఒక్కసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్‌తో చేసిన ఉత్పత్తులపై నిషేధం అమలు చేస్తున్నట్లు టైగర్ ప్రాజెక్టు మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్ గురువారం తెలిపారు. శ్రీశైలం, దోర్నాల, మాచర్ల అటవీ ప్రాంతాల్లో వెళ్లే ప్రయాణికులు తమ వాహనాల నుంచి ప్లాస్టిక్ ఉత్పత్తులను విసిరేయవద్దని సూచించారు. ఈ విషయమై ఇప్పటికే శ్రీశైల దేవస్థానం ఈఓతో కూడా మాట్లాడమన్నారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో క్లాత్, పేపర్, జూట్ బ్యాగ్‌లు వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ సంరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎవరైనా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు అమ్మినా, వినియోగించినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. నాగార్జున సాగర్, శ్రీశైలం అటవీ ప్రాంతాన్ని టైగర్ రిజర్వ్‌గా ప్రకటించారని, ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ నిషేధించామని, అందరూ సహకరించాలని కోరారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్



సింగరాయకొండ-ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

సింగరాయకొండ: ఆటోను వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో పల్లతోటి రమేష్‌కు తీవ్రంగా, మరో ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం సాయంత్రం సింగరాయకొండ మండల పరిధిలో విమానాల రన్‌వేపై కనుమళ్ల జంక్షన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా కొరిశపాడు గ్రామానికి చెందిన పచ్చాకు కూలీలు నెల్లూరు జిల్లా కందుకూరులోని పాలేటి గంగ ప్రాంతానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆటోను రన్‌వేపై టిప్పర్ బలంగా ఢీకొట్టింది. ఆటో పూర్తిగా ధ్వంసం కాగా, తన్నీరు నాగరాజు, రేవెళ్ల రాంబాబు, పల్లతోటి జయమ్మకు స్వల్ప గాయలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన రమేష్